# నెలనెలా వెన్నెల



అవసరాల రామకృష్ణారావు

ఆ రిజర్వుడ్ కంపార్టుమెంట్‌లో పై బెర్త్‌మీద పడుకున్నానన్న మాటే గాని దొర్లి కిందపడినట్టయింది నాపని. ఆ ముక్కలు చెవిలోపడి. నాకున్న మెడికల్ నాలెడ్జి పరిమితమే, ఒప్పుకుంటాను. జీవితంలో ఏ ఒక్క వ్యక్తికీ అన్ని విషయాలూ అనుభవంలోకీ రావలసిన అవసరంలేదు. కొన్ని వింటాం, కొన్ని చదివి తెలుసుకొంటాం, ఆకాస్త పరిచయమే యిప్పుడు నన్నిలా హడలెత్తించింది కాబోలు.

**రుజల్ని పంచకండి**
**ప్రజల్ని చంపకండి**

లేకపోతే నా చెవిలో చెదురు మదురుగా పడుతున్న ముక్కలు తక్కువ శక్తివంతమైనవా మరి? ఓ పెద్దావిడ ఓ చిన్నావిడతో, రైలు చప్పుడుని తోసి రాజనే గొంతుకతో, తన శరీర బాధలు వివరిస్తోంది. వాళ్ళిద్దరూ సరిగ్గా నా బెర్త్ కిందే కూర్చున్నారు. కనుక పరిశీలించక పారిపోయే అవకాశం లేదు నాకు.

నాకు మొట్టమొదటి ఆపరేషను ఎప్పుడయిందనుకున్నావు, పదహారో ఏట! పోయిన ఏడు చేయించుకున్నది ఎన్నోది అనుకున్నావ్, ఎనిమిదోది! నలుగురు డాక్టర్లు ఆరు గంటలసేపు హోరాహోరీ పోరాడి ఎనిమిది ఇంచీలమేర కడుపుకోసి మేజర్ ఆపరేషన్ చేస్తేగాని ఆ బిడ్డ సంచీ యివతల పడలేదే మాయమ్మా!"

.... ఇలా సాగింది ధోరణి. నాకు తెలివొచ్చింది వాల్తేరులో, ఫుల్‌స్టాపూ కామా లేకుండా కొనసాగిన యీ లెక్చెరు ఆగిపోయి. మళ్ళీ నేను మనుషుల్లో పడ్డది విజయవాడలో మాత్రమే. మేంముగ్గురం దిగిపోవలసింది అక్కడే కాబట్టి, ఆ రైలు కూడా అంతకుమించి వెళ్ళదు కాబట్టి....

వెడుతూ వెడుతూ ఆ పెద్దావిడ ఓ మాట అంది :

"ఇంతకీ నేను అనుభవించిన నరకం నీకేం చెప్పినట్లు అయింది అమ్మాయీ, ఆవగింజలో అరవయ్యో వంతు! ఏదో యిలా చావలేక దినాలు దొర్లిస్తున్నా ననుకో .."

సాటి మనిషిమీద సానుభూతి కేంద్రంగా సమస్త కళలూ జన్మిస్తాయనే తరగతికి చెందిన రచయితని నేను. అయితేనేం ఎంత మనసుని సమాధాన పరుచుకున్నా కొంచెమైనా ఆ పెద్దావిడ అంటే జాలి ఏర్పడడంలేదు.చాలా దగ్గరగా,స్పష్టంగా ఆవిడ చెబుతున్నదంతా వినడమే కాకుండా అలా చెబుతున్నప్పుడు ఆవిడ హావభావాలు పరిశీలించాను. ఎంతో నిజాయితీ ఉంటేగాని అంత ఉద్రేకం ఉండదు. లేని రోగం ఉన్నట్టు చెబుతుందేమో, హైపోకోంద్రియా లాంటి ఏదైనా ఉందేమో అనుకుంటేవాటికి ఎటువంటి అవకాశమూ లేదు. ఆవిడ ఉదహరించిన ఆపరేషన్ల పేర్లు, ఢిల్లీ నుంచి రాయవెల్లూరు దాకా తిరిగిన ఆస్పత్రులు, తీసుకున్న మందుల వివరాలు-నేను విన్నంతవరకూ ఏది కొట్టి పారెయ్యటానికి వీలులేదు. మరి ఇంతగా శిల అయిపోయిందేం నా మనసు ,

లేదు శిల అయిపోలేదు గనకనే ఆవిడప్రవర్తనమీద అంతకోపం. ఇంతకీ నాకు సానుభూతి కలగలేదనడం కూడా సరియైనమాటకాదు. నా సానుభూతి ఆవిడకి తప్ప ఆ కంపార్టుమెంటులోఉన్న మిగిలిన అందరిమీదా ముఖ్యంగా ఆమె ఎదురుగా కూర్చుని అన్నీ వినవలసి వచ్చిన చిన్నావిడమీద, ఆవిడతోపాటు అన్నీవింటూ బిక్క-మొగంవేసేసిన చిన్నావిడమీద యింతింత పిల్లలమీద.ఇష్టంలేని ఏ కుటుంబ నియంత్రణ ప్రోగ్రామో అదే పనిగావస్తే రేడియో చెవి నులిమి నోరు మూయిస్తాము ఇక్కడ ఆ అవకాశంలేదు. ఎన్ని.చేసినతో పారబోసినా కంట్రోలు కాని రక్తస్రావం ...ఎన్ని సెలైన్ బాటిల్స్ పెట్టినా అందుకోని పల్సురేటూ . ఇలాంటవి ఇంకో అన్ని చచ్చినట్టు వినవలసిందే. ఇంచుమించు యాభై దగ్గరపడుతున్న ఆ పెద్దావిడకి రైల్లో తారసపడిన ఓ ముక్కూ మొహం ఎరగని ఆవిడతో-అదే వాళ్ళ జీవితంలో కలుసుకోడం, రైలు దిగిపోతే మళ్ళీ కలుసుకుంటారనే గ్యారంటీలేదు-గంటల తరబడి తన జబ్బు అట్టుగుట్టు ఆన వాళ్ళు చెప్పిందంటే అది అజ్ఞానమో అమాయకత్వమో నేను లేప్పలేనుగాని అపరాధం కాదంటే మాత్రంఒప్పుకోను. జ్ఞానపీఠ్ ఎవార్డులాగే మిస్‌వరల్డు బహుమతిలాగే జబ్బు రోగిష్టికి ఏదైనా కానుక యిస్తే, మెరిసే కళ్ళతో వణికే చేతుల్తో తనంతకప్పు ఆవిడ సంగర్వంగాఅందుకోలేక అనేక రకమైన బాధల్లో తల్లడిల్లిపోతున్న ప్రజానీకానికీ 'అయ్యో లోకంలో శోకం తక్కువైందా ఏమిటి' అని అడక్కుండా అవురావురుమని రోగ మాలికలను ఆలాపించే దోషుల్నిమాత్రం తూర్పారపట్టకుండా ఉండలేను.

'ఉబ్బసం ఘోరమా, మధుమేహం బాధాకరమా ?' అనే విషయాన్ని చర్చనీయాంశంగా పెట్టి సభలు నడిపే చచ్చు పెద్దమ్మలు ఎవరూ వుండరు. అలాగే 'పయోరియా నయమా, ఫైలేరియా




క్షేమమా?' అనే కుశ్నంకలు ఎవరూ లేవదియ్యరు. ఎందుకంటే స్వర్గాలు ఎన్ని వర్గాలో మనకి తెలీదు గాని నరకాలు మాత్రం నానా రకాలు. దీనికి అంతూ లేదు, దరీ లేదు. 'ఈ రోగం వల్ల నేను అనుభవించినంత శరీర బాధ మరెవరూ అనుభవించి వుండరు' అని ఎవరైనా ఛాలెంజ్ చేస్తే, వాళ్ళు నవ్వులపాలు కాక మానరు. 'సంసారం గుట్టు రోగం రట్టు' అనే నామెతకి అర్థం — రోగం ముదిరి పోకుండా అశ్రద్ధ చెయ్యక చెయ్యదాటి పోకుండా వెంటనే వెళ్ళి డాక్టర్ని సంప్రదించి తగిన మందు పుచ్చుకోమని, లేదా మనకి బాగా తెలిసిన, మనసు కలసిన, ఒకరిద్దరు ఆప్తులతో వచ్చిన శరీర కష్టం చెప్పుకోమని, అంతేగాని ఒక ముఖమూ, రెండు చెవులూ కనీ కనపడగానే ఉండబట్టక, బట్టఉండక, నీ డప్పు అవతలివారి ఇయర్ డ్రమ్స్ బద్దలయేలా బజాయించమని కాదు.

ఇలాంటి పెర్వర్టెడ్ ఎగ్జిబిషనిజమ్ బాగా చదువుకున్న వాళ్ళలో కూడా ఉందని చెప్పడానికి మాకు తెలిసిన ఒక ఎడ్వోకేట్‌గారే మంచి ఉదాహరణ. ఆయన యింట్లో అడుగు పెట్టిన పార్టీల్లో కనీసం సగంమంది అయినా ఏదో ఒక జబ్బు రాకుండా యివతలపడే అవకాశంలేదు. ఇలా కాలింగ్‌బెల్ వినగానే అలా ఎలక్ట్రిక్ బల్బులా వెలిగిపోతుంది ఆయన మోహం. వచ్చిన అవకాశం చేజారిపోతే మళ్ళీ దొరుకుతుందో, లేదో, ఒహో; ఏమి ఆ తహ తహ! ఔరా? ఏమి ఆ త్వరత్వర!

"కూర్చోండి కూర్చోండి" అని పార్టీల్ని గబుక్కుని లేవలేని కుర్చీల్లో కూలదోసి ఒక్కొక్క పాత్రనీ రంగం మీదకి తీసుకొచ్చి పరిచయం చేస్తాడు.

"రవాణా, ఒసే రవాణా, ఎక్కడ చచ్చావ్—తొందరగా రావే ....రా .... ఇలా కూర్చో మనవాళ్ళే....ఫరవాలేదు.

పరికిణీ ఎత్తి ఎడంకాలు ఇవతలికి పెట్టు. ఏం అనుకోర్లే....ఇది మామూలు కాలు అనుకుంటున్నారు కదూ! పొరపాటు సుమండీ ... స్కూల్నించి వస్తూంటే బస్సుక్రింద పడి ఎడంకాలు మడుకు క్రిందనుంచి అంతా ముద్దముద్ద అయిపోయింది. యాంప్యుటేషన్‌చేసి మరాను భావుడు పోతన అనాడే శలవిచ్చినట్టు, 'దుష్టాంగంబు ఖండించి శేషాంగశ్రేణికిన్ రక్షసేయుక్రియ.' ఎలాగో పిల్లని బతికించారు. ఆర్టిఫిషియల్‌లింబ్‌సెంటర్ వాళ్ళకి రాసి ఈప్లాస్టిక్ పాదం తెప్పించాం, ఇప్పుడిప్పుడే దాన్ని ఉపయోగించడానికి అలవాటు పడుతోంది చెబితేగాని తెలీదంలేదుకదూ!... సరే నువ్వెళ్ళి మీ చిన్నన్నని పంపించవే.

'వీడు మా మూడో అబ్బాయి విజయ్ అండి....మొన్ననే మెట్రిక్‌కి అప్పియర్ అయ్యాడు. వీడి కళ్ళలో మాకేం చిత్రం కనబడలేదూ? ఎదురుగుండా ఉన్నది ఎలకో ఏనుగో తెలీదు, అంతటి షార్టుసైటు వీడిది. స్కూలుకెళ్ళే ఇంత కుర్రాడూ, చూసి చూసి కళ్ళజోడు తగిలించడానికి ఒప్పలేదు నా ప్రాణి. అయితే అయిందని హైదరాబాదు తీసికెళ్ళి 'కాంటాక్టు లెన్సు' అంటారు చూడండీ, అవి తగిలించాను. కొత్తవి ఏవో పెట్టినట్లే లేదుకదూ, అదే తమాషా ఏమనుకున్నారు మరి!...

'ఇక ఇలావచ్చి వెళ్ళంది మా అమ్మగారు మీరు, చూసేఉంటారు ఆరేళ్ళ కిందట పల్లెటూళ్ళో మా యిల్లు అంటుకున్నప్పుడు ఆవిడ సామాను గదిలో చిక్కడిపోయింది. ఎలాగో ప్రాణాలతో ఇవతల పడేశారుగాని మొహం తనది కాదు, అంతలా మాడిపోయింది. పచ్చడి చేసుకోగానికి వంకాయ కాలుస్తాం చూడండి అలా కుతకుత ఉడికిపోయింది. నెలరోజులు గడిచాక బతుకులో పడిందన్న మాటేగాని ఆ మొహం చూసేసరికి ఎంతతెలిసినవాళ్ళయినాజడుసుకునేవారు. ఇలాంటి సదుపాయం ఉందని అదృష్టవశాత్తూ ఓ చోట విని బొంబాయి కెళ్ళి పడ్డాం. ప్లాస్టిక్ సర్జరీ అంటారు. ఎప్పుడేనా విన్నారా? ఆర్నెల్లుఉంచేశాం. పాతికవేలు ఖర్చుపెట్టేం, మామూలు స్థితికి వచ్చిందంటే మేమే నమ్మలేకుండా ఉన్నాం. దూరంనుంచి అలా కనిపిస్తోంగాని ఆ మొహమంతా ముప్ఫై మూడు అతుకులు. మీరే చూద్దురుగాని....ఇలారా అమ్మా!

పార్టీలు లేచి నిలబడతారు.

'పరవాలేదు. పిల్లలాంటివారు. ఆవిడ ఏమీ అనుకోదు....సరే మీరే అలా మొహమాట పడిపోతే నేనేం చెప్పను! పోనీ యీ ఒక్కమాటా చెప్పి వెళ్లిపోండి. ఇంతసేపై మాట్లాడుతున్నాను. నాలో ఏ కృత్రిమ భాగమూ మీరు గుర్తించనేలేదా!'

తెల్లబోయినవాళ్ళ మొహాలు చూసి ఇల్లెగిరిపోయినట్టు నవ్వి చటుక్కున నోట్లో చెయ్యిపెట్టి – రెండు వరసల విడిభాగాలూ వాళ్ళ చేతుల్లో పెట్టి 'ఇవి కట్టుడు పళ్ళండీ బాబూ,' అన్నట్టు బోసినవ్వులు వెలిగిస్తారు ఎడ్వొకేటుగారు! శుభ్రంగా తోముకున్న నిజం పళ్ళనయినా అడక్కుండా ఎవరైనా ప్రదర్శిస్తే 'ఛత్ నోర్ముయ్యి' అనబుద్ధి వేస్తుంది.

అలాంటిది అదో అరటిపండు అస్త్రంలా చేతిలో పెడితే గతిలేని పార్టీలు అయితే ఊరుకుంటారేమోగాని మరొకరు అయితే ముందాయన పేగంతాల్ని ఇంతింత ముక్కలుగా విసిరేసి మళ్ళీ యిలాంటి వెకిలి వేషాలకి అవకాశం లేకుండా ఆ రెండు దవడల్నీ అంట నొక్కెయ్యరూ!

ఆపరేషన్ ఒక అనన్య సౌభాగ్యం అనీ దీర్ఘరోగం ఒక యోగ్యతా పత్రం అనీ ఎన్నికల ప్రచారాన్ని మంచి టేప్ రికార్డర్ పెట్టే యీ వెర్రి పీనుగుల జాబితాలో చేరేదే మరొక చిన్న సైజు చచ్చు లక్షణం. ఈ రకం జీవులు వారు లండన్‌లో ఉండనీ, వీరులంకలో ఉండనీ 'కన్ను కలిగినది' అని వీరూ, 'కాలు బెణికినది' అని వారూ క్షేమసమాచారాలు తెలుపుకుంటూ ఉంటారు. ఉత్తరం అందేలోగానే ఆ కాస్త బాధా పోతుందని తెలిసినా.

వీరేశలింగంగారు బతికున్నన్నాళ్ళూ శ్వాసకోశ రోగంతో బాధపడ్డారు. ఆయన పోయిన తర్వాత మనకు జ్ఞాపకముండేవి ఆయన అనాస, ఉబ్బస రోగాలుకావు. ఆయన నిలబడింది శతాధిక గ్రంథకర్తగా సాటిలేని సంఘసంస్కర్తగా .... విన్నో మొన్నో కన్నుమూసిన చక్రపాణిగారు సగం జీవితం ఒకే ఊపిరితిత్తితో గడిపేరు. అయితేనేం, సాహిత్య చలనచిత్ర సీమల్లో కొత్త ఊపిరులు ఊదేరు. కృష్ణశాస్త్రికి గొంతుక లేదని ఏం ఆగింది, తీయ తేనియలు పలికించగల గుండె ఉండగా! దుర్గాబాయి దేశ్‌ముఖ్‌కి కంటి చూపు పూర్తిగా దెబ్బ తింటేనేం, మరే స్త్రీ యివ్వలేనంత వెలుగు స్త్రీ లోకానికి ప్రసాదించిన హృదయం ఉండగా! మనవాళ్ళ యీ నలుగురి మాటా చాలదా వ్యక్తిత్వం అంటూ ఉంటే దైహిక బాధ మనిషినేం చెయ్యలేదని చెప్పడానికి! అందరికీ అంత శక్తి లేకపోతేమానె. మన ధోరణి విని నలుగురూ నవ్వుతున్నారనైనా గుర్తించకపోతే ఎలా? ఇంకా వీరువినరుకదూ, డాక్టరుకి పిటీషను పెట్టక మానను.

ఓ డాక్టరు మహాశయా! ప్రజా క్షేమం దృష్టిలో పెట్టుకుని చిన్నసూచన. మీరు ఆపరేషన్ పూర్తి చేసి, శరీర భాగాలు సరిగ్గా అమర్చి తిరిగి కుట్లు వేస్తారు చూశారూ, అప్పుడు, పనిలో పని, ఆ చేత్తోనే, ఆ పేషెంటు నోరు కూడ కొంచెం కుట్టెయ్యరూ! ●

---

*1. తమ రచనలతోపాటు సొంత చిరునామ గల కవరు పంపనియెడల ఆ రచనలగురించి ఎట్టి ఉత్తర ప్రత్యుత్తరములు జరపబడవు.*

*2. రచనలలో మార్పులు చేర్పులు చేసుకొను హక్కు మాకు ఉన్నది.*

---